క్లుప్తంగా

కమనీయం.. సీతారాముల కల్యాణం

పెనగలూరు : మండలంలోని దిగువ సిద్దవరం గ్రామంలో సీతారాముల కల్యాణం శనివారం రాత్రి కమనీయంగా జరిగింది. సిద్దవరం రాంబాబు, కల్పన, శివాజీ, సుమశ్రీ, శ్రీకాంత్‌రెడ్డి అనే అన్నదమ్ముల దంపతులు ఈ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమన్ని కల్యాణ దాతలు ఏర్పాటు చేశారు. పురోహితుడు వెంకట సుబ్బయ్య స్వామి ఆధ్వర్యంలో మేళతాళాల మధ్య కల్యాణం నిర్వహించారు. అనంతరం చెక్కభజన కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ చైర్మన్ సిద్దవరం పెంచలయ్య తెలియజేశారు.


భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు



శనేశ్వరస్వామికి తైలాభిషేకం చేస్తున్న భక్తులు

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీ మందగిరి శనేశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి గణపతిపూజ, కలశ స్థాపన, పుణ్యాహావాచనం, క్షీరాభిషేకం, తైలాభిషేకం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనేశ్వర స్వామికి అత్యంత ప్రీతి ప్రథమైన రోజు శనిత్రయోదశి అని ఆలయ అర్చకులు సిద్దవటం సుబ్రమణ్యంస్వామి తెలిపారు. స్వామిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఆకట్టుకున్న 'అర్జునుడి తపస్సు'



అర్జునుడి తపస్సు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వీరబల్లి : మండలంలోని మట్లి తొగటపల్లి వద్ద మాండవ్య నది ఒడ్డున వెలసిన శ్రీ కోదండరామస్వామి దేవాలయం వద్ద వారం రోజుల నుంచి జరుగుతున్న మహా భారత యజ్ఞంలో భాగంగా శనివారం జరిగిన అర్జునుడి తపస్సు కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. అర్జునుడు తపస్సు మాను ఎక్కే కార్యక్రమంలో భక్తులు పాల్గొని తరించారు. అర్జునుడి తపస్సు దగ్గర సంతానం లేని స్త్రీలు వరపడటం జరిగింది. తమ కోరికలు తీర్చాలంటూ భక్తులు ప్రత్యేక పూజలు చేసి కాయా కర్పూరం సమర్పించి హారతి పట్టారు.

శ్రీరాముడు.. పురుషోత్తముడు



టీటీడీ మాజీ సభ్యుడిని సన్మానిస్తున్న నిర్వాహకులు

రాయచోటి టౌన్ : శ్రీ రామచంద్రుడు ఆదర్శ పురుషోత్తముడిగా ప్రసిద్ధి గాంచారని మాజీ టీటీడీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. శ్రీ రాముడు సకల గుణ సంపన్నుడు, శక్తిశాలి, ధర్మాత్ముడు, సత్యాన్ని పలికేవాడు, దృఢమైన సంకల్పం కలిగినవాడు, అన్ని ప్రాణుల మంచి కోరేవాడని పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలోని కొత్తపేట శివరామాలయంలో శనివారం శ్రీ సీతారాముల వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ టీటీడీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. భక్తులు చేసిన శ్రీరామ నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. ఈ కార్యక్రమంలో అంగడి సాయి, పెరికల రెడ్డెన్న, పురం రెడ్డెయ్య, ఆంజనేయులు, ఎర్ర శివ, చిట్టి శివ, శ్రీనివాసులు, లాయర్ సతీష్‌రెడ్డి, బడిశెట్టి రవి, వాకా వాసు, మన్నేరు రామాంజనేయులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు మంజూరు

పెనగలూరు : మండలంలో ఎస్సీ, ఎస్టీలకు 31 సబ్సిడీ లోన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ విజయారావు తెలిపారు. పెనగలూరు స్టేట్ బ్యాంకుకు 12, పెనగలూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుకు 10, ఓబిలి స్టేట్ బ్యాంకుకు నాలుగు, పొందలూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు 5 సబ్సిడీ లోన్లు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. కావున అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉగ్రదాడిపై వెల్లువెత్తిన నిరసన



రాయచోటి : న్యాయవాదుల నేతృత్వంలో ర్యాలీ



లక్కిరెడ్డిపల్లి : ముస్లింల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ

రాయచోటి అర్బన్ : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం దుర్ఘటనపై నిరసన వెల్లువెత్తింది. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి.. నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. రాయచోటిలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, ప్రజాసంఘాటల నేతలు కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ప్రభాకరరెడ్డి, రెడ్డిబాషా, భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్, ఎంఆర్ పియస్ నేత రామాంజులు, రజకసంఘం నేతలు రమేష్, శ్రీనివాసులు, రమణ, రైతుసంఘం నేత రంగారెడ్డి, నాయీబ్రాహ్మణ సంఘం నేత రమణతోపాటు న్యాయవాదులు టి.వి.రమణ, హుమయూన్‌బాషా, రాజకుమారి చంద్రికా, వరలక్ష్మి, కుశుమ, నాగముని, ఖాదర్‌బాష, జనార్దన్‌రెడ్డి, నిరంజన్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు : మండల కేంద్రంలో హిందూ సంఘాల ఐక్యవేదిక నేతృత్వంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో స్థానిక ప్రజానీకం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లిలో ముస్లింల ఐక్యవేదిక



గాలివీడు : కొవ్వొత్తులతో ప్రదర్శన

ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సిద్దగాల శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు మన్సూర్, రిజ్వాన్, అహ్మద్ అలీ, ఫరీద్, సలీం, సాదుల్లా, సర్కార్జీ, ముక్తార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేద్దాం

సంబేపల్లె : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి.. మండలాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిద్దామని ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మీ తెలిపారు. శనివారం మండల ప్రజాపరిషత్ సభా భవనంలో సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా వుందని, పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పశువులకు సంబంధించి నీటి తొట్లు గుట్టపల్లె గ్రామానికి ఎందుకు మంజూరు కాలేదని గ్రామ సర్పంచ్ చిదంబర్‌రెడ్డి ఉపాధి సిబ్బందిని ప్రశ్నించారు. వెంటనే నీటి తొట్ల నిర్మాణాలు చేపడతామని ఉపాధి ఏపీఓ తెలిపారు. దుద్యాల గ్రామంలోని కొండకింద దళితవాడలో తీవ్రంగా నీటి ఎద్దడి వుందని మండల ఉపాధ్యక్షురాలు భాగ్యమ్మ సభ దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే నీటి సమస్యను పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. ప్రకాష్‌నగర్ కాలనీ సమీపంలోని జెడ్పీసీ భూములకు సంబంధించి అర్హు



మండల సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ నాగశ్రీలక్ష్మి

లైన వారికి పాసుపుస్తకాలు రాలేదని సర్పంచ్ మోహన్ తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని ఆయా శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కవితారమేశ్‌రెడ్డి, తహసీల్దార్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణంరాజు క్షమాపణ చెప్పాలి

రాయచోటి అర్బన్ : ప్రజా ఉద్యమాల సారధి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు క్షమాపణలు చెప్పి, నోటిని శుద్ధి చేసుకోవాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. భీమవరంలో శ్రీనివాసరావుపై రఘురామ కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలపై సీపీఎం నేతలు మండిపడ్డారు. ఈ సందర్భంగా శనివారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు మాట్లాడారు. »బతికిపోయావు« అంటూ శ్రీనివాసరావుపై బెదిరింపులకు దిగడం ఒక ప్రజాప్రతినిధిగా



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు

ప్రజలకు ఎలాంటి సంకేతాలు పంపుతున్నారో ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం నేతలు నాగబసిరెడ్డి, ఈశ్వరయ్య, రైతు సంఘం నేత రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

నందలూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఎంఈఓలు నాగయ్య, అనంత కృష్ణ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం నుంచి ఆర్‌ఎస్ రోడ్డు వరకు ప్రభుత్వ పాఠశాలలపై ప్రచారం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జనరల్ సెక్రటరీ లీలా కృష్ణయ్య, ప్రెసిడెంట్ షఫీ ఉల్లా, మహేశ్వరబాబు, సంజీవ ప్రసాద్, అల్లం అశోక్



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కుమార్, రమేష్ బాబు, కృపానందం, లక్ష్మీ రాజ్యం, లక్ష్మీకాంతమ్మ, గాయత్రీ దేవి, సందాని తదితర మండల ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాపారులు కాటాలు సరిచేసుకోవాలి

సిద్దవటం : వ్యాపారులు కాటాలు సరిచేసుకోవాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. సిద్దవటంలోని హరిత టూరిజం గెస్ట్‌హౌస్‌లో శనివారం కాటాలు, తూనిక రాళ్లకు వ్యత్యాసాలను సరిచేసి ముద్రలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం, అట్లూరు మండలాల వ్యాపారులను పిలిపించి వారి కాటాలు, తూనిక రాళ్లలో వ్యత్యాసాలు ఉంటే గమనించి సరిచేసి ముద్రలు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్‌లు శివశంకర్, సాయికుమార్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకాల్వ పల్లెలో దాహం కేకలు

- చందాలతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా
- బోర్ వేసి మోటారు బిగించని అధికారులు



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు



గ్రామంలో నూతనంగా తవ్విన బోరుబావి

రాయచోటి : ఆ గ్రామం అన్నమయ్య జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. అయినా ఆ ఊరిలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి నివారణకు 900 అడుగుల లోతు బోరుబావి తవ్వారు. బోరులో నీరు పుష్కలంగా ఉన్నా.. మోటారు ఏర్పాటు చేయలేదు. దీంతో గ్రామస్తులు చందాలు వేసుకొని ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకొని వినియోగించుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. రాయచోటి రూరల్ మండల పరిధిలోని ఎండపల్లి గ్రామం పెద్దకాల్వపల్లిలో కొన్ని రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. గ్రామంలో 200 గృహాలు ఉన్నాయి. గ్రామానికి సరఫరా చేసే నీటి పథకం బోరు ఎండిపోవంతో నూతనంగా మరో బోరు బావిని తవ్వారు. 900 అడుగుల లోతు వేసిన బోరుబావిలో నీరు పుష్కలంగా పడింది. గ్రామంలో నెలకొన్న రాజకీయాల కారణంగా అధికారులు మోటారు ఏర్పాటు చేయడంలో ఆలస్యం చేస్తున్నారు. ఫలితంగా రోజూ ట్యాంకరుకు రూ. 800 నుంచి రూ. 1000 చెల్లించి నీటిని కొనుగోలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. రోజూ ఇంటికి కొంత డబ్బులు వసూలు చేసుకొని ట్యాంకర్లను పిలిపించుకుంటున్నారు. జిల్లా కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు వేడుకుంటున్నారు.

అధికారులు స్పందించడం లేదు



గ్రామంలో నెలకొన్న తాగు నీటి విషయాన్ని మండల పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. బోరుకు మోటార్ వేసి తమ కష్టాలు తీర్చాలని కోరినా ఫలితం లేదు. ఎవరికి చెప్పుకోలేక తలా కొంత చందాల రూపంలో డబ్బులు చెల్లించుకొని ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నాం.

– బాలకృష్ణారెడ్డి, స్థానికుడు

28 నుంచి భగవద్గీత పారాయణం

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామంలో వెలసిన శ్రీ భద్రావతి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 28 నుంచి 30 వరకు శ్రీమద్ భగవద్గీత పారాయణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భద్రావతి భావనారాయణ స్వామి, శ్రీ కోదండ రామస్వామి సంయుక్త ఆలయాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 5 నుంచి 7 వరకు ఆధ్యాత్మిక వక్తలచే ఉపన్యాసాలు, శ్రీమద్ భాగవతం, మహావిష్ణు సహస్రనామ పారాయణం, గోవింద నామాల ఆలాపనల కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. వేసవి సెలవుల సందర్భంగా పిల్లలు, పెద్దలు, మహిళలు విరివిగా పాల్గొనాలని కోరారు.

3న ఆలయ భూముల వేలం

చిట్వేలి : చిట్వేలిలో వెలసి ఉన్న శ్రీ శ్యామలాంబ సమేత శ్రీ సోమేశ్వరస్వామి, శ్రీ వరదరాజస్వామి, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన భూములను మే 3న సదరు దేవస్థానంలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు రాజంపేట సమూహ దేవస్థానాల కార్యనిర్వహణ అధికారి జి.కొండారెడ్డి తెలియజేశారు. ఆరేళ్ల కాలపరిమితితో అనగా 2025–26 నుంచి 2030–31 వరకు భూములను కౌలుకు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8247431840 అనే ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అన్నదానం

చిట్వేలి : మానవత చిట్వేలి శాఖ ఆధర్యంలో శనివారం చిట్వేలి గ్రామ నివాసి పూజారి గౌరీ శంకర్ మొదటి వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, కుమారుడు మహత్ మౌర్య, కుమార్తె షణ్ముఖ ప్రియ స్థానిక శివాలయం వద్ద శనివారం పేదలకు, పారిశుధ్య కార్మికులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష,కార్యదర్శులు మునిరావు, సాయిరాం, సుబ్రమణ్యంరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బయ్య, కంచర్ల సుధీర్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఓబులవారిపల్లె : ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి రెడ్డయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఎనిమిది ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని, వైబ్‌సైట్‌లో పాఠశాలల పేర్లు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కావున ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేసు నమోదు

సుండుపల్లె : మండల పరిధిలోని సొంతంవారిపల్లె గ్రామ పంచాయతీ కొండలతూర్పు గ్రామంలో ఇంటి గోడను కూల్చాడని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. కొండలతూర్పు గ్రామంలో విశ్వనాథ్ నివసించే ఇంటి గోడను రవి అనే వ్యక్తి కూల్చివేశాడని శనివారం విశ్వనాథ్ స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.

సమస్యలపై దృష్టి సారించండి

చిట్వేలి : మండలంలోని సమస్యలపై సమష్టిగా దృష్టి సారించాలని ఎంపీడీఓ మోహన్ తెలిపారు. శనివారం ఎంపీపీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శానిటేషన్, గృహనిర్మాణం, ముఖ్యంగా నీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

29న మండల సమావేశం

గాలివీడు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29న ఎంపీపీ జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జవహర్ పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మండల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఇంటి పన్ను రాబట్టాలి

రాజంపేట : పట్టణంలో కొత్తగా నిర్మితమైన ఇళ్లకు ఇంటి పన్ను రాబట్టేందుకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనరు శ్రీనివాసులు తెలిపారు. శనివారం సచివాలయ అమ్మిటీ సెక్రటరీలతో ఇంటి పన్నుపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి పన్ను, నీటి పన్ను వంద శాతం కలెక్షన్ చేయాలన్నారు. సమావేశంలో 13 సచివాలయల అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం.. అనుసరణీయం

రాజంపేట టౌన్ : క్రీస్తు మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తుమ్మల అగ్రహారంలో శనివారం ఫాదర్ మార్టిన్ లూథరన్ ఆధ్వర్యంలో అఖిల భారత బేతేలు చర్చి 29వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ సర్వమానవాళికి ఏసుక్రీస్తు రక్షకుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

గోపి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు రెడ్డిమాసి రమేష్‌నాయుడు, సౌమిత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ వెలికితీసేందుకు దోహదం

రాజంపేట : అన్నమాచార్య అగ్రికల్చరల్ కాలేజీలో శనివారం ఆరంబ్–2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నమాచార్య యూనివర్సిటీ వీసీ సాయిబాబారెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరస్పర పరిచయం, ప్రతిభను వెలికితీయడానికి ఆరంబ్ 2024 ఒక వేదికగా దోహద పడుతుందన్నారు. విద్యార్థులకు కొత్త శక్తి, ఉత్సాహాన్ని నింపేలా వేడుక ఉందన్నారు. ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ రాజంపేట గ్రామీణ ప్రాంతానికి ఇంజినీరింగ్ విద్యను తీసుకొచ్చిన ఘనత విద్యావేత్త చొప్పా గంగిరెడ్డికే దక్కిందన్నారు. ఇప్పుడు వ్యవసాయ విద్యను కూడా రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. మన ప్రాంతం నుంచి ఇంజినీరే కాదు వ్యవసాయ విద్యార్థులను కూడా పరిచయం చేసేం



ఆరంబ్-2024 ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి

దుకు అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ గంగిరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అనంతరం క్విజ్‌పోటీలు, ఉద్గారపోటీలు, చిత్రలేఖన పోటీలు, మ్యూజికల్స్ చైర్స్ వంటి వివిధ సృజనాత్మక, ఉత్సాహ పూరిత కార్యక్రమాలు నిర్వసించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ డీన్ లోకనాథం, రిజిస్ట్రార్ మలికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడుతున్న వారిని శిక్షించాలి

రాయచోటి అర్బన్ : జిల్లాలో పలు శాఖల ప్రభుత్వాధికారులపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు కలెక్టరేట్ ఏఓను కలుసుకుని వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాలివీడు మండలం పందికుంట వీఆర్‌ఓ జయన్నపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలన్నారు. ఇటీవల కాలంలో మదనపల్లె ఆర్ఐపై దాడి జరిగిందని, శుక్రవారం ఓబులవారిపల్లె వీఆర్‌ఏపై దాడి చేశారని, అంగళ్ళు,సిటియం పంచాయతీల వీఆర్‌ఓలపై దాడులకు దిగి దుర్భాషలాడిన సంఘటనలు గతంలో ఉన్నాయన్నారు.



కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐటీయూసీ నేతలు

జిల్లాలో విధినిర్వహణలో ఉన్న ప్రభుత్వాధికారులపై దాడులకు తెగబడుతున్న వారిని జిల్లా అధికార యంత్రాంగం కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాయచోటి కార్యదర్శి బత్తల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి వేసవి శిక్షణ శిబిరం

రాయచోటి అర్బన్ : విద్యార్థులకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక నేతలు తెలిపారు. శనివారం పట్టణంలోని విజ్ఞాన్ స్కూల్ ఆవరణలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలందరూ ఉచితంగా పాల్గొనవచ్చునన్నారు. పేపర్ క్రాఫ్ట్, మట్టితో బొమ్మలు చేయడం, పెయింటింగ్, సైన్స్‌ప్రయోగాలు, సరదా గణితం, మ్యాజిక్‌షో, క్విజ్, ఆటపాటలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శిబిరాన్ని పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో జేవీవీ నేతలు బయారెడ్డి, ఓబులరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, వై.సి.రెడ్డెప్పరెడ్డి, రాజశేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేవీవీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి

మట్టిలో మాణిక్యం మేఘన

రాయచోటి అర్బన్ : వీరబల్లి మండలం పెద్దివీడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని రాసింటి మేఘన మట్టిలో మాణిక్యమని ఎస్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి అన్నారు. 2025 పదో తరగతి ఫలితాల్లో 595 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ సభా భవనంలో మేఘనను ఎస్టీయూ ఆధ్వర్యంలో శనివారం సన్మానించి అభినందించారు. అనంతరం మేఘనకు అన్నమయ్య జిల్లా ఎస్టీయూ తరఫున రూ.10 వేలను ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు రవీంద్రనాథరెడ్డి, మురళీకుమార్, వెంకటేశ్వరరెడ్డి, మున్వర్, మునీర్‌బాషాతోపాటు పలువురు ఎస్టీయూ సభ్యులు పాల్గొన్నారు.

అభినందనలు

వీరబల్లి: మండలంలోని పెద్దవీడు దళితవాడకు చెందిన మేఘన ఇటీవల జరిగిన పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో 600 మార్కులకు గాను 595 మార్కులు సాధించి



వీరబల్లి: మేఘనను అభినందిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ విద్యార్థినిని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి, పెద్దవీడు సర్పంచ్ నాగిరెడ్డితో కలిసి మేఘనను శనివారం అభినందించి విరాళంగా రూ. 5 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డిలు ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం విద్యార్థినీని శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాల గంగమ్మ తిరునాల

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని సాలాబాద్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న చెరువు కట్టపై వెలసిన బందారుపల్లి కాల గంగమ్మ తిరునాల మొదటి రోజు శనివారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ వారు భారీగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళా భక్తులు బోనాలు సమర్పించి, బలుల రూపంలో మొక్కులను తీర్చుకున్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

కాల గంగమ్మ తిరునాలను పురస్కరించుకుని శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ కమిటీ సభ్యులు బండలాగుడు పోటీలను రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

సిద్దవటం : మండల పరిధిలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులు ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని భాకరాపేట, కనుమలోపల్లె రైల్వేస్టేషన్‌లు, హెచ్‌పీసీఎల్ కంపెనీని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో భద్రతను పెంచుకోవాలని హెచ్‌పీసీఎల్, రైల్వే అధికారులకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ బాబు, సిద్దవటం ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాచుపల్లె గ్రామంలో..

మండలంలోని మాచుపల్లె గ్రామంలో పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ, ఒంటిమిట్ట ఎస్‌ఐ శివప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.



సిద్దవటం : హెచ్‌పీసీఎల్‌లో మేనేజర్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పోలీసుల నాకా బందీ

నందలూరు : మండలంలోని లేబాక గ్రామంలో పోలీసులు శనివారం నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట రూరల్ సీఐ బివి రమణ మాట్లాడుతూ గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఐ మోహన్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.